జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం

గురువారం | 2 | ఏప్రిల్ | 2026 ◆ పేజీలు : 6


# తొమ్మిది మంది మావోయిస్టుల లొంగుబాటు

- లొంగిపోయిన వారిపై 30లక్షల రివార్డ్



చర్ల, ఏప్రిల్ 01:(ప్రజా జ్యోతి ): మహారాష్ట్ర లోని గడ్చిరోలి జిల్లాలో నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ ఒక పెద్ద విజయాన్ని సాధించింది. బుధవారం ముగ్గురు ఏసీఎంలతో సహా తొమ్మిది మంది మావోయిస్టులు పోలీసులకు, సీఆర్పీఎఫ్ కు లొంగిపోయారు. వారిపై మహారాష్ట్ర ప్రభుత్వం 30 లక్షల రివార్డును ప్రకటించింది.లొంగిపోయే సమయంలో మావోయిస్టులు ఏకే–47లు, కార్బైన్లతో సహా పలు ఆయుధాలను అప్పగించారు. భద్రతా దళాలు అడవి నుంచి భారీగా ఆయుధాలను, మందుగుండు సామగ్రిని కూడా స్వాధీనం చేసుకున్నాయి.అధికారుల ప్రకారం, 2025 నుండి 132 మంది మావోయిస్టులు హింసను విడనాడటంతో, గడ్చిరోలిలో నక్సలైట్ కార్యకలాపాలు సరిహద్దు ప్రాంతాలకే పరిమితమయ్యాయి అని గడ్చిరోలి, బస్తర్ లలో లొంగిపోవడాలు పెరగడం నక్సలైట్ సంస్థలు బలహీనపడుతున్నాయని అధికారులు భావిస్తున్నారు.



# ఆయిల్‌పామ్ రైతుకు 'ధర' హాసం

- – రికార్డు స్థాయికి గెలల ధర
- రైతాంగంలో ఉత్సాహం – రాష్ట్రవ్యాప్తంగా ఆయిల్ పామ్ సాగుదారులకు భారీ ఊరట

దమ్మపేట, ఏప్రిల్ 01,(ప్రజాజ్యోతి): రాష్ట్రంలోని ఆయిల్ పామ్ సాగుదారులకు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సుభవార్త అందింది. మార్కెట్ పరిస్థితులు, అంతర్జాతీయ ముడి పామాయిల్ ధరలను సమగ్రంగా విశ్లేషించిన తెలంగాణా ఆయిల్ ఫెడ్ తీసుకున్న తాజా నిర్ణయంతో గెలల ధరలు చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరుకున్నాయి. రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచే ఈ నిర్ణయం పట్ల రైతాంగం హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తోంది.

**టన్నుకు రూ. 23,005 – చరిత్రలో తొలిసారి 23 వేల మార్క్ దాటిన ధర**

ఫిబ్రవరి నెలలో టన్ను ధర రూ. 21,546గా ఉండగా, మార్చి నెలలో ఏకంగా రూ. 1,459 పెంపుతో రూ. 23,005గా ఖరారు చేయడం విశేషం. ఆయిల్ ఫెడ్ చరిత్రలో తొలిసారి ఈ ధర 23 వేల మార్క్ ను దాటడం రైతులకు ఆర్థికంగా ఎంతో లాభదాయకంగా మారింది. ఈ పెరుగుదలతో ఆయిల్ పామ్ సాగు మరింత ఆకర్షణీయంగా మారింది.

**మంత్రి చొరవ – రైతుల కోసం ప్రత్యేక చర్యలు**

ఈ ధరల పెంపు వెనుక వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు కీలక పాత్ర పోషించారు. రైతులకు గరిష్ట లాభం చేకూరేలా మంత్రి నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ,ఆయిల్ ఫెడ్ తో సమన్వయం చేస్తూ మెరుగైన ధరలు అందేలా చర్యలు చేపట్టారు. ప్రభుత్వ మార్గదర్శకత్వంలో

మిగతా 2 లో...



# "మీ పిల్లలకు కూడా ఇలానే భోజనం పెడతారా?"

- పాఠశాలలో జిల్లా కలెక్టర్ అంకిత్ ఆగ్రహం
- దమ్మపేట మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ విస్తృత పర్యటన

దమ్మపేట ఏప్రిల్ 1,(ప్రజాజ్యోతి): దమ్మపేట మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం విస్తృత పర్యటన నిర్వహిస్తూ తహసీల్దార్ కార్యాలయం, పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న సేవలు, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, ముఖ్యంగా మధ్యాహ్న భోజన నాణ్యతపై సమగ్రంగా ఆరా తీశారు. మొదటగా దమ్మపేట తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్, కార్యాలయంలోని అన్ని విభాగాలను తనిఖీ చేసి, దరఖాస్తుల పరిష్కార విధానంపై అధికారులను ప్రశ్నించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి, కుల ధృవీకరణ, ఆదాయ, నివాస ధృవీకరణ, రేషన్ కార్డుల వంటి దరఖాస్తుల పురోగతిని తెలుసుకున్నారు. దరఖాస్తులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. "మీ సేవ" ద్వారా చెల్లించవలసిన రుసుముల వివరాలను కార్యాలయంలో స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. భూ సమస్యలు, సర్టిఫికెట్ల జారీ వంటి అంశాలు మండల స్థాయిలోనే

మిగతా 2 లో...

# రైతులను రాజు ను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- రైతులకు మద్దతు ధర ఇస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వమే
- రైతులకు వ్యవసాయ పనిముట్లను సబ్సిడీతో అందజేస్తున్న ప్రభుత్వం
- మద్దతు ధరలు కల్పించే విధంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- ఇల్లందు మండలంలో మొక్కజొన్న కొను



- గోలు కేంద్రాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

ఇల్లందు, ఏప్రిల్ 1, ప్రజాజ్యోతి: ఆరుగాలం కష్టించి పంటను పండించే రైతులను రాజు ను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. బుధవారం పిఎసిఎస్ ఆధ్వర్యంలో మండలంలోని రేపల్లెవాడ, కొమరారం

మిగతా 2 లో...

# కాలుష్య కోరల్లో భద్రగిరి



- కరకట్ట సమీపంలో యథేచ్ఛగా చెత్త దహనం
- కాలుష్య కోరల్లో పవిత్ర పుణ్యక్షేత్రం
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు, భక్తులు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు..
- ప్రాణాలు రక్షించాలని ప్రజలు వేడుకోలు..

భద్రాచలం టౌన్, ఏప్రిల్ 1 ప్రజాజ్యోతి: దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం పుణ్యక్షేత్రం ప్రస్తుతం కాలుష్య కోరల్లో చిక్కుకుంది. ఒకవైపు ఆధ్యాత్మికతతో వెలుగొందాల్సిన ఈ క్షేత్రం, మరోవైపు గ్రామ పంచాయితీ అధికారుల నిర్లక్ష్యంతో 'పొగ నిలయం'గా మారుతోంది. పట్టణంలోని కరకట్ట సమీపంలో ప్రతిరోజూ సాయంత్రం భారీ ఎత్తున చెత్తను తగులబెడుతుండటంతో వెలువడుతున్న విషతుల్యమైన పొగ కాలుష్యం

మిగతా 2 లో...

## రైతులను రాజు ను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి...)



గ్రామాలతోపాటు ఇల్లందు వ్యవసాయ మార్కెట్ యర్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు మద్దతు ధర ఇస్తుంది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. ముఖ్యంగా రైతులకు వ్యవసాయ పనిముట్లను సబ్సిడీతో ప్రభుత్వం అందజేస్తుందని పేర్కొన్నారు. ఇల్లందు మండలంలో 27 వేల ఎకరాలలో మొక్కజొన్న సాగు చేయడం జరిగిందని తెలిపారు. రైతులు పండించిన మొక్కజొన్నలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. మొక్కజొన్నను కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే వారికి వసతులను ఏర్పాటు చేయాలని, వర్షం వస్తే దాన్యం తడవకుండా టార్ఫాన్లను అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేయడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం రైతులకు ఏమి చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏమి చేస్తుందో ఆలోచించుకోవాలని సూచించారు. రైతులకు మద్దతు ధరలు కల్పించే విధంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సహకారంతో ఇల్లందు 16 గురువులు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇల్లందు, టేకులపల్లి, కామేపల్లి మండలాల్లో మూడు, గార్ల ఒకటి, బయ్యారం మండలాల్లో 5 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల పంట దళారుల చేతులకు వెళ్లాక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని, ఇందిరమ్మ ప్రభుత్వం రైతులకు పంట చేతికి రాకముందే సమీప ప్రాంతాలలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే రైతులు పండించిన మొక్కజొన్నను విక్రయిస్తే రూ. 2400 మద్దతు ధర వస్తుందని తెలిపారు. డబ్బులు త్వరగా వస్తాయని, దళారుల వద్ద తక్కువ ధరకు మొక్కజొన్నను విక్రయించవద్దని సూచించారు. రైతులకు వరి పంటకు రూ. 500 బోనస్, రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు భీమా వంటి పథకాలతో రైతన్నకు అండగా ఉంటున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బానోత్ రాంబాబు, మాజీ పిఏసిఎస్ చైర్మన్ మెట్ల కృష్ణ, మాజీ వైస్ యంపిపి మండల రాము, ఏడిఏ లాల్ చంద్, ఏఓ సతీష్, వార్డు కౌన్సిలర్లు మెరుగు కార్తీక్, జాఫర్, సర్పంచ్ గుగులోత్ నాగార్జున, పిఏసిఎస్ సెక్రటరీ హీరాలాల్, వ్యవసాయ మార్కెట్, పిఏసిఎస్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాలుష్య కోరల్లో భద్రగిరి

(మొదటి పేజీ తరువాయి...)



స్థానికులు, భక్తులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది.

**– కమ్మేస్తున్న కాలుష్యం**

కనుచూపు మేర కనిపించని రహదారి ప్రతిరోజూ సాయంత్రం కాగానే కరకట్ట పరిసర ప్రాంతాలు దట్టమైన పొగతో నిండిపోతున్నాయి. ఈ పొగ కారణంగా కరకట్టపై ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించని పరిస్థితి నెలకొనడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**– ఉక్కిరిబిక్కిరి అవుతున్న భక్తులు, పర్యాటకులు**

రాముడి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులు ఇక్కడి వాతావరణాన్ని చూసి విస్తుపోతున్నారు. గోదావరి తీరాన స్వచ్ఛమైన గాలి పీల్చుకుందామనుకుంటే, దుర్వాసనతో కూడిన పొగ కారణంగా ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టంగా మారిందని వారు వాపోతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు.

**– అనారోగ్యం పాలు.. అధికారుల మౌనం**

చెత్త దహనం వల్ల వెలువడే హానికర వాయువుల కారణంగా కరకట్ట పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. దగ్గు, కళ్ల మంటలు, ఆస్తమా వంటి సమస్యలు వేధిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "అధికారులకు కరకట్ట ప్రాంతంలో నివసించే ప్రజలు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. సాయంత్రం సమయంలో ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడుతోంది. కాలుష్యం నుంచి మా ప్రాణాలను రక్షించండి" అని స్థానికులు వేడుకుంటున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ పంచాయతీ అధికారులు స్పందించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెత్తను శాస్త్రీయ విధానంలో నిర్వర్తించకుండా బహిరంగంగా తగులబెట్టడంపై పర్యావరణ ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భద్రాద్రిని కాలుష్య రహితంగా మార్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఆయిల్ పామ్ రైతుకు 'ధర' హాసం

(మొదటి పేజీ తరువాయి...)

తీసుకున్న ఈ నిర్ణయం రైతుల సంక్షేమానికి అంకితభావాన్ని చాటుతోంది. ప్రపంచవ్యాప్తంగా ముడి పామాయిల్ ధరల హెచ్చుతగ్గులు రైతులపై ప్రభావం చూపకుండా ఉండేందుకు ఆయిల్ ఫెడ్ సమతుల్య ధర విధానాన్ని అమలు చేసింది.

దీని వల్ల రైతులు ధరల మార్పుల భయం లేకుండా సాగుపై దృష్టి సారించే అవకాశం ఏర్పడింది. ఇది వ్యవసాయ రంగానికి స్థిరత్వాన్ని తీసుకురానుంది.



**రైతాంగంలో ఉత్సాహం – సంబరాల్లో సాగుదారులు**

ఈ ధరల పెంపుతో రాష్ట్రవ్యాప్తంగా రైతాంగంలో కొత్త ఉత్సాహం నెలకొంది. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా, నల్గొండ జిల్లా వంటి ప్రాంతాల్లో రైతులు వీధుల్లోకి వచ్చి సంబరాలు చేసుకున్నారు.

పలుచోట్ల మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకాలు నిర్వహిస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

తాము కోరకముందే రికార్డు స్థాయిలో ధరలు పెరిగేలా కృషి చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రైతులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నారు. తమ కుటుంబాలకు ఆర్థికంగా మేలు జరిగిందని, ఈ నిర్ణయం తమ జీవితాల్లో వెలుగులు నింపిందని భావోద్వేగంతో చెబుతున్నారు.

**ఆయిల్ పామ్ సాగుకు పెరుగుతున్న ఆదరణ**

ఈ ధరల పెంపు ప్రభావంతో రానున్న రోజుల్లో మరింత మంది రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు మళ్లే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ నిపుణులు అంచనా వేస్తున్నారు.

రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగును విస్తరించి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం ఈ నిర్ణయంతో మరింత బలపడింది. ఆయిల్ పామ్ రంగంలో ఈ రికార్డు ధరలు రైతులకు మాత్రమే కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతమివ్వనున్నాయి.

స్థిరమైన ధరల విధానం, ప్రభుత్వ సహకారం కొనసాగితే ఆయిల్ పామ్ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## "మీ పిల్లలకు కూడా ఇలానే భోజనం పెడతారా?"

(మొదటి పేజీ తరువాయి...)







పరిష్కారం కావాల్సి ఉండగా, ప్రజలు ప్రజావాణి కార్యక్రమానికి ఎందుకు దూర ప్రాంతాల నుంచి రావాల్సి వస్తోందని తహసీల్దార్ ను ప్రశ్నించారు. సమస్యలను స్థానికంగానే త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రికార్డు రూమ్ ను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశమై, విద్యుత్, మిషన్ భగీరథ, ఇరిగేషన్, వ్యవసాయం, పోలీస్ శాఖల పనితీరును సమీక్షించారు. గ్రామసభల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేయాలని, వేసవి కాలంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం దమ్మపేట తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించిన కలెక్టర్, ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న భోజనాన్ని నేరుగా పరిశీలించారు. మెనూ ప్రకారం ఆ రోజు చికెన్ బగారా రైస్ అందించాల్సి ఉండగా, అది అందుబాటులో లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, మెనూ పాటించకపోవడంపై సంబంధిత సిబ్బందిని ప్రశ్నించారు. విద్యార్థులకు అందించవలసిన ఆహారాన్ని ఎందుకు ప్రదర్శించడం లేదని వెంటనే ప్రదర్శించాలని ఆదేశించారు. విద్యార్థులకు వడ్డించడానికి సిద్ధంగా ఉన్న ఆహారాన్ని స్వయంగా రుచి చూసిన కలెక్టర్, ఆహార నాణ్యతపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "మీ పిల్లలకు కూడా ఇలానే భోజనం పెడతారా?" అని ప్రశ్నిస్తూ వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్మేకర్ కూర సరిగా నువ్వు ఉడక పోవడం , రుచి, నాణ్యత లోపించడం పట్ల అసహనం వ్యక్తం చేస్తూ, విద్యార్థులకు పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారం అందించాలని, భవిష్యత్తులో నిర్లక్ష్యం పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునే ప్రదేశంలో కుళాయిలకు ట్యాప్ లు లేకపోవడంతో నీరు వృథాగా పోతున్న పరిస్థితిని గమనించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మందలపల్లి క్రాస్ రోడ్డు వద్ద గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను పరిశీలించిన కలెక్టర్, అక్కడ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజన నాణ్యత, సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. స్టోర్ రూమ్ ను పరిశీలించి కూరగాయలు, ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. వంటశాలలో గ్యాస్ సిలిండర్ల నిల్వలు, భద్రతా చర్యలపై ఆరా తీసి, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ రామ్ నరేష్, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఎంఈఓ జగదీష్, ఉపాధ్యాయురాలు స్టెల్లా, వార్డెన్ దుర్గ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ దుర్మరణం

**దమ్మపేట, ఏప్రిల్ 01, (ప్రజాజ్యోతి):** జనగాం జిల్లా తరిగొప్పుల మండలం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ చిలువేరు రమేష్ (32) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషాద ఘటన దమ్మపేట మండలంలో చోటుచేసుకుంది. హైదరాబాదులోని సింధు పార్సెల్ సర్వీస్ కు చెందిన లారీని హైదరాబాదు నుండి జంగారెడ్డిగూడెం వైపు నడుపుకుంటూ వెళ్తున్న రమేష్ కు మంగళవారం రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో గున్నేపల్లి గ్రామ శివారులో లారీ టైర్ పంచర్ అయింది. దీంతో సమీపంలో పంచర్ దుకాణం కోసం రోడ్డు మీద నడుస్తూ వెళ్తున్న సమయంలో సత్తుపల్లి నుండి మొద్దులగూడెం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు బూరుగు వంశి, నారం నాగరాజు అతడిని బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రమేష్ తలకు తీవ్ర గాయాలు కావడంతో రక్తస్రావం అధికమైంది. అదే సమయంలో బైక్ పై ఉన్న ఇద్దరు యువకులు కూడా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అయితే రమేష్ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై పార్సిల్ సర్వీస్ అశ్వరావుపేట ఏజెంట్ మౌలాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో మృతుడి కుటుంబంలో విషాదం నెలకొంది.

# యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ పాఠశాలలు, ఏటీసీ కళాశాలల స్థల సమీకరణ, అనుమతుల పురోగతిపై సమీక్ష

- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 1, ప్రజా జ్యోతి**




జిల్లాలో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ పాఠశాలలు , ఏటీసీ కళాశాలల నిర్మాణానికి సంబంధించి స్థల సమీకరణ, అవసరమైన అనుమతుల పురోగతిపై జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత శాఖల అధికారులతో ఐడీఓసీ కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ విద్యాసంస్థల ఏర్పాటుకు సంబంధించిన స్థల సమీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన అన్ని అనుమతులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. విద్యా రంగ అభివృద్ధికి ఈ సంస్థలు ఎంతో కీలకమని అన్నారు .అనుమతుల జారీ ప్రక్రియలో ఎలాంటి ఆటంకాలు లేకుండా శాఖల మధ్య సమన్వయం పెంపొందించాలని, ప్రతి దశలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను వెంటనే పరిష్కరించి పనులను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. సంబంధిత భూముల విషయంలో ఎలాంటి వివాదాలు లేకుండా సమగ్ర పరిశీలన జరిపి చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు . ఈ సమావేశంలో ఇల్లందు తాసిల్దార్ రవికుమార్, అశ్వరావుపేట తాసిల్దార్ రామకృష్ణ , ఈ సెక్షన్ సూపర్డెంట్ స్వర్ణలత, రామవరం ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మీ సేవ' ఆన్లైన్ సేవలకు తాత్కాలిక అంతరాయం

- ఛార్జీల పెంపు అమలు
- ఈ _డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు

**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 1,ప్రజా జ్యోతి:**జిల్లాలో సర్వర్ నిర్వహణ పనుల నేపథ్యంలో 'మీ సేవ' ఆన్లైన్ సేవలకు తాత్కాలిక అంతరాయం ఏర్పడనున్నట్లు ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 3వ తేదీ సాయంత్రం 5:00 గంటల నుంచి ఏప్రిల్ 5వ తేదీ ఉదయం 8:00 గంటల వరకు సర్వర్ నిర్వహణ పనులు కొనసాగనున్నట్లు వెల్లడించారు. సర్వర్ పనితీరు మెరుగుదల, భద్రతా వ్యవస్థల అప్‌గ్రేడ్, సాంకేతిక సమస్యల నివారణ కోసం ఈ నిర్వహణ చేపడుతున్నట్లు తెలిపారు ఈ కాలంలో సంబంధిత విభాగాలకు చెందిన అన్ని ఆన్లైన్ సేవలు, డిజిటల్ లావాదేవీలు, వెబ్ పోర్టల్ సేవలు తాత్కాలికంగా నిలిపివేయబడతాయని తెలిపారు, కావున ప్రజలు అత్యవసర సేవలను ముందుగానే వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. నిర్వహణ పూర్తయిన అనంతరం సేవలు సాధారణ స్థితికి చేరుకుంటాయని తెలిపారు. భవిష్యత్తులో వేగవంతమైన, అంతరాయం లేని సేవలను అందించేందుకు ఈ చర్యలు ఉపయుక్తమవుతాయని అన్నారు, ఇక 'మీ సేవ' కేంద్రాల ద్వారా అందించే వివిధ ధ్రువపత్రాలు , ఇతర సేవలకు సంబంధించిన సేవా ఛార్జీలను ప్రభుత్వం సవరించినట్లు తెలిపారు. సవరించిన ఛార్జీలు నేటి నుండి అమల్లోకి వస్తాయన్నారు, ఇప్పటివరకు రూ.35గా ఉన్న కనీస సేవా ఛార్జీని రూ.62కు పెంచినట్లు తెలిపారు. 'ఏ' కేటగిరీ సేవలకు రూ.62 చొప్పున, 'బీ' కేటగిరీ సేవలకు రూ.80 చొప్పున ఛార్జీలు నిర్ణయించినట్లు తెలిపారు, అదనంగా కరెంటు బిల్లులు, ఈ-పాస్ సేవలు, బయోమెట్రిక్ సేవలు, డ్రైవింగ్ లైసెన్స్‌కు సంబంధించిన సేవలకు కూడా సవరించిన ఛార్జీలు వర్తిస్తాయని వెల్లడించారు. కావునప్రజలు ఈ మార్పులను గమనించి సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## స్తంభం పై నుండి పడి వ్యక్తి మృతి



**ఇల్లందు, ఏప్రిల్ 1, ప్రజా జ్యోతి:**పట్టణంలోని మెయిన్ రోడ్డు వద్ద విద్యుత్ లైన్లు మరమ్మత్తులు చూస్తున్న క్రమంలో విద్యుత్ స్తంభం పై నుంచి క్రిందపడి ఉదయ్ అనే కాంట్రాక్ట్ కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం విద్యుత్తు లైన్లను మరమ్మత్తు చేస్తున్నక్రమంలో ఎల్సి తీసుకున్నట్లు తెలుపదంతో కాంట్రాక్టు కార్మికుడు విద్యుత్ స్తంభం ఎక్కినట్లు తెలిపారు. దీంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్ కు గురై క్రింద పడి ఉదయ్ అనే కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడు మర్రిగూడెం గ్రామానికి చెందినట్లు తెలుస్తుంది. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కిరణ్ కుమార్ బాధ్యతల స్వీకరణ




**చుంచుపల్లి , ఏప్రిల్ 1 ( ప్రజాజ్యోతి )**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బార్ అసోసియేషన్ కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన పాల్వంచకు చెందిన సీనియర్ న్యాయవాది కిరణ్ కుమార్ ముదలక్కర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కోర్టు లైబ్రరీ హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్నికల అధికారి పలివెల గణేష్ బాబు చేతుల మీదుగా ఆయన పదవిని స్వీకరించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ న్యాయవాదులందరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారందరినీ సమన్వయం చేసుకుంటూ సంక్షేమం కోసం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తానని తెలిపారు. కొత్త జిల్లా కోర్టు భవన నిర్మాణం పూర్తి చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 2026-27 సంవత్సరానికి ఎన్నికైన తన ప్యానెల్ సభ్యులతో కలిసి బార్ అసోసియేషన్ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మొత్తం 10 స్థానాలకు పోటీ జరగగా, కిరణ్ కుమార్ ప్యానెల్ నుంచి 9 మంది విజయం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులుగా కాటూరి సంజీవ్ రావు, షాజాన్ పర్వీన్, ప్రధాన కార్యదర్శిగా గడిపెల్లి మహేష్, సంయుక్త కార్యదర్శిగా గడదాస్ నాగరాజు, గ్రంథాలయ కార్యదర్శిగా దొడ్డ ప్రసాద్, కోశాధికారిగా గుళ్ళ సంధ్య రాణి, క్రీడలు-సాంస్కృతిక విభాగం కార్యదర్శులుగా బానోత్ దేవదాస్, నకిరికంటి ఉమా, మహిళ ప్రతినిధిగా నిమ్మలురి ఉషారాణి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జీ.వి.కే మనోహర్, బాబురావు, ఉటుకురి పురుషోత్తం, పలివేల సాంబశివరావు, ఆర్. విజయ్ కుమార్, లక్కినేని సత్యనారాయణ, రమేష్ కుమార్ మక్కడ్, గాజుల రామ్మూర్తి, అనుబ్రోలు రాంప్రసాద్, భాగం మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## సిమెంటు బల్లలు వితరణ




**బూర్గంపహాడ్, ఏప్రిల్ 1, (ప్రజా జ్యోతి):**బూర్గంపహాడ్ మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ సంత సమీపంలో కొలువైన శివాలయం, వైకుంతదామం వద్ద భక్తులు, ప్రజల సౌకర్యార్థం తన తండ్రి సంకా వీరభద్రం జ్ఞాపకార్థం కుమారుడు సంకా సురేష్ రూ.7వేల విలువైన రెండు సిమెంటు బల్లలను బుధవారం వితరణగా అందించారు.వాటిని ఆయా ప్రాంతాల్లో ప్రజలు, భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు.

## మర్రిగూడెంలో అయ్యప్ప స్వామి జన్మ నక్షత్ర వేడుకలు

- భక్తి శ్రద్ధలతో అభిషేకాలు, అన్నదానం
- పల్లకి సేవలో భక్తుల ఆనందం



**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 1, ప్రజా జ్యోతి:**అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని మర్రిగూడెం గ్రామంలో అయ్యప్ప స్వామి జన్మ నక్షత్ర వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీ కోదండ రామాలయం వద్ద తెల్లవారు జామున నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.వేద పండితులు సాయి శర్మ చేతుల మీదుగా స్వామివారికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామి భక్త బృందం, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ విజయసింహా రెడ్డి మాట్లాడుతూ, గ్రామ యువత భక్తి మార్గంలో నడుస్తూ మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఆధ్యాత్మికత మన జీవితాన్ని సన్మార్గంలో నడిపిస్తుందని తెలిపారు.తదనంతరం గ్రామ మహిళలు, చిన్నారులు ఆనందకోలాటాల నడుమ స్వామివారికి పల్లకి సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పర్స వెంకటేశ్వర రావు, శివాలయం వైస్ చైర్మన్ పూర్ణ, ఉప సర్పంచ్ గాలం కాటం రాజు, రామాలయ చైర్మన్ సోమరాజు, గ్రామ పెద్దలు వీరబోయిన అప్పారావు, వీరబోయిన నాగరాజు, సీతారాములు, జంగిలి బిక్షం తదితరులు పాల్గొన్నారు. గ్రామ మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## మున్సిపల్ కార్మికులకు ₹22,750 వేతనం ఇవ్వాలి

- కమిషనర్‌కు సీఐటీయూ వినతి



**కొత్తగూడెం, ఏప్రిల్ 1 ( ప్రజాజ్యోతి )** మున్సిపల్ కార్మికులకు శ్రమకు తగిన విధంగా నెలకు ₹22,750 వేతనం చెల్లించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు కార్మికులు కార్పొరేషన్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా రమేష్ మాట్లాడుతూ కొత్తగూడెం నోటిఫైడ్ ఏరియా కాలం నుంచి పనిచేస్తున్న కార్మికులు కార్పొరేషన్‌గా మారిన తర్వాత కూడా పాత వేతనాలతోనే కొనసాగుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ₹14,500 మాత్రమే అందుతోందని, దీంతో కుటుంబ పోషణ కష్టమవుతోందన్నారు. పారిశుద్ధ్య కార్మికులు పగలు-రాత్రి తేడా లేకుండా నగరంలోని ప్రధాన రహదారులు, గల్లీల్లో, మురికివాడల్లో పని చేస్తూ ప్రజలకు ఆరోగ్యాన్ని అందిస్తున్నప్పటికీ, వారికి తగిన వేతనం, రక్షణ సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ మాస్కులు, గ్లౌజులు, యూనిఫారాలు, బూట్లు వంటి రక్షణ సామగ్రి ఇవ్వడం లేదని, ఆరోగ్య పరిరక్షణలోనూ నిర్లక్ష్యం కొనసాగుతోందన్నారు. గత మూడు సంవత్సరాలుగా కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్పొరేషన్ సమావేశంలో వెంటనే తీర్మానం చేసి ప్రతి కార్మికుడికి ₹22,750 వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికుడు మరణిస్తే అంత్యక్రియల ఖర్చుల కోసం ₹20,000 అందించే ప్రభుత్వ నిబంధనలను అమలు చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికుల సంఖ్య పెంచడంతో పాటు, కార్పొరేషన్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. డిమాండ్లను పట్టించుకోకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకురాలు అంబాల దుర్గమ్మతో పాటు పుట్ట సుశీల, సరిత, లక్ష్మి, అంబాల సీత, అంబాల రాజమణి, సంజీవ్, రఫీ, హరిత, సుధా సమ్మయ్య తదితర కార్మికులు పాల్గొన్నారు.

## పల్లెప్రకృతివనంలో విద్యుత్ మోటారు చోరీ



**బూర్గంపహాడ్, ఏప్రిల్ 1,(ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని ఇరవెండి పల్లెప్రకృతివనంలో విద్యుత్ మోటారు చోరీకి గురైంది. దీనికి సంబంధించి పంచాయతీ సర్పంచ్, ఉపసర్పంచ్ లు గుండి బాబూరావు, మహంకాళి రామారావులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్లెప్రకృతివనంలో మొక్కల సంరక్షణ నిమిత్తం ఏర్పాటు చేసినవిద్యుత్ మోటార్ ను గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి చోరీచేసినట్లు తెలిపారు. దినచర్యలో భాగంగా పల్లెప్రకృతి వనంలో మొక్కలకు నీళ్లు పెట్టాలని వెళ్లిన సిబ్బందికి విద్యుత్ మోటార్ చోరీకి గురైందని తెలిసి సర్పంచ్, ఉపసర్పంచ్ లకు సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటనాస్థలానికి వెళ్లి చూడగా విద్యుత్ మోటారు అపహరణకు గురైందని గుర్తించి పోలీసులకుఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు. చోరీకి గురైన మోటారు విలువ రూ.30వేలు ఉంటుందని తెలిపారు.

## ఆకస్మిక తనిఖీతో పాఠశాల పనితీరుపై డీఈఓ సమీక్ష



**పాల్వంచ, ఏప్రిల్ 1, ప్రజాజ్యోతి:** పాల్వంచ పట్టణంలోని వికలాంగుల కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్న విధానంపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆమె, ప్రతిరోజూ నిర్దేశిత మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.అనంతరం విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను పరిశీలించి, వారికి నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించి, అవసరమైన సదుపాయాలు మరియు సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీలలో ఏప్రిల్ 2న గ్రామసభలు

- **ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యక్రమం**

**పాల్వంచ, ఏప్రిల్ 1, ప్రజాజ్యోతి:** పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2వ తేదీన అన్ని గ్రామపంచాయతీలలో గ్రామసభలను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజా పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, ప్రభుత్వ పథకాలపై చర్చించడం, లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరించడం, గ్రామ అభివృద్ధి అవసరాలను గుర్తించడం, గ్రామ సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం ఈ గ్రామసభల ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. అలాగే పథకాల అమలులో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి జి. శ్రీనివాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి బోగ్గ నారాయణ మాట్లాడుతూ గ్రామసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ గ్రామసభలకు సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్థాయి శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, రైతులు, యువత, స్వయం సహాయక సంఘ సభ్యులు మరియు పథకాల లబ్ధిదారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ చెన్నకేశవరావు, ఏపీఓ పోరాడ్ల రంగ మరియు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# గ్రామ సభలు విజయవంతం చేయాలి

- **జిల్లా కలెక్టర్ అంకిత్**

**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్1, ప్రజా జ్యోతి:**




జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ అమలు లో భాగంగా గ్రామ సభలను విజయవంతగా నిర్వహించాలి అని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు, మున్సిపల్ పట్టణాల్లో వార్డు సభలను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని సభలకు హాజరయ్యే ప్రజలకు తాగునీటి సదుపాయం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సభల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను గ్రామ, వార్డు స్థాయిలో ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. ఇందుకోసం ప్రతి శాఖ తమకు సంబంధించిన పథకాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేసి ప్రజలకు వివరించాలని అన్నారు, సభలు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా షామియానాలు ఏర్పాటు చేయాలని , అదేవిధంగా వైద్య ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి గర్భిణులు, చిన్నారులకు వైద్య పరీక్షలు చేయాలని సూచించారు.విద్యాశాఖ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని, వ్యవసాయ శాఖ రైతులకు లాభదాయక పంటలు, ఉద్యాన పంటలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఏప్రిల్ 2వ తేదీ నుంచి జిల్లాలో వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో సభలను విజయవంతం చేయడం ద్వారా ప్రజల సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం చూపడం ముఖ్య లక్ష్యమని కలెక్టర్ అన్నారు, జిల్లా ప్రజలు సభలకు సమయానికి హాజరై స్థానిక సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

## బదిలీపై వెళ్తున్న వైద్యులకు ఘన సన్మానం

- **తొమ్మిదేళ్ల సేవలతో ప్రజల మన్ననలు పొందిన డాక్టర్ ప్రియాంక, డాక్టర్ తన్మయికి ఆత్మీయ వీడ్కోలు**





**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 1, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రియాంక, డాక్టర్ తన్మయి బదిలీపై వెళ్తున్న సందర్భంగా సిబ్బంది, పాత్రికేయుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు.మండల కేంద్రంలో సుమారు తొమ్మిది సంవత్సరాలుగా విధులు నిర్వహించిన ఈ ఇద్దరు వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ విశేష మన్ననలు పొందారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చినా శ్రద్ధతో చికిత్స అందించి ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్నారు.అనంతరం పలువురు మాట్లాడుతూ, ఈ ఇద్దరు వైద్యులు బదిలీపై వెళ్లిపోవడం మండలానికి తీరని లోటు అని తెలిపారు. ముఖ్యంగా డాక్టర్ ప్రియాంక పీజీ సీటు రావడం పట్ల అభినందనలు తెలియజేశారు. ఇద్దరూ కుటుంబ సభ్యుల్లా ప్రజలతో కలిసిమెలిసి ఉండి, గ్రామంలో జరిగే కార్యక్రమాలకు సైతం ఆప్యాయంగా హాజరయ్యేవారని కొనియాడారు.ఈ సందర్భంగా ఎంఈఓ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ, కరోనా కాలంలో డాక్టర్ ప్రియాంక సేవలు ఎంతో ప్రశంసనీయం అని తెలిపారు. మండలంలోని గ్రామాలను స్వయంగా సందర్శిస్తూ ప్రజల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లను తరచూ సందర్శించి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన కల్పిస్తూ జాగ్రత్తలు పాటించేలా చైతన్యం తీసుకువచ్చారని అన్నారు. క్లిష్ట సమయంలో కూడా వెనుకడుగు వేయకుండా సేవలు అందించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం నింపారని కొనియాడారు. కరోనా కాలంలో ఆమె అందించిన సేవలు ఎప్పటికీ స్మరణీయమని తెలిపారు.వైద్య సేవలతో పాటు మానవత్వంతో వ్యవహరించిన ఈ ఇద్దరు వైద్యులు ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. వారి సేవలు ఎప్పటికీ స్మరణీయంగా నిలుస్తాయని పలువురు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఆనంద్ కుమార్, స్థానిక ఎస్సై విజయసింహారెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ జగదీశ్వరి, ఎంపిడిఓ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రముఖులు, ఆసుపత్రి సిబ్బంది, పాత్రికేయులు, మిత్రులు పాల్గొని వైద్యులకు ఆత్మీయ వీడ్కోలు పలికారు.

## నేడు అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించాలి

- **పినపాక ఎంపీడీవో వెంకటేశ్వర రావు**



**పినపాక,ఏప్రిల్ 01(ప్రజాజ్యోతి):** పినపాక మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో రేపు గ్రామ సభలను తప్పనిసరిగా నిర్వహించాలని ఎంపీడీవో వెంకటేశ్వర రావు ఆదేశించారు. పినపాక ఎంపీడీవో కార్యాలయంలో సెక్రటరీలతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవడం, ప్రభుత్వ పథకాల అమలు స్థితిని సమీక్షించడం కోసం ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.గ్రామసభల్లో తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్యుత్ వంటి ప్రాథమిక సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రతి గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామ అభివృద్ధికి సహకరించాలని ఎంపీడీవో కోరారు.

## మోరంపల్లిబంజర్ సంత వేలం రూ.35.61లక్షలు

- **గతేడాది కంటే రూ.2.11లక్షలు ఆదాయం అదనం**

**బూర్గంపహాడ్, ఏప్రిల్ 18, (ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ పంచాయతీలో వారాంతపు సంత వేలంపాటను భద్రాచలానికి చెందిన చేతన మీ సేవా నిర్వాహకుడు పాటదారుడు భూక్యా రంజిత్ నాయక్ బుధవారం రూ.35.61లక్షలకు కైవసం చేసుకున్నారు. ఎంపీడీవో కుడుముల జమలారెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ బొర్రా సుభద్ర, ఉపసర్పంచ్ పొక్కుల రవి సమక్షంలో మోరంపల్లిబంజర్, సారపాక, పినపాక పట్టీనగర్ కార్యదర్శులు భవానీ, కంది మహేష్, విజయ్ నిర్వహించారు. గత ఏడాది రూ.33.50లక్షలకు కూరగాయలు, పశువుల సంతను దక్కించుకోగా ఈ ఏడాది అదనంగా రూ.2.11లక్షలు పంచాయతీకి ఆదాయం రావడంతో ప్రజాప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు. పాటదారుల నుంచి పోటీ పెరగడంతో ఏకంగా రూ.35.61లక్షలకు భూక్యా రంజిత్ నాయక్ సంత వేలాన్ని దక్కించుకోవడంతో సర్పంచ్, ఉపసర్పంచ్, అధికారులు పాటదారుడిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాటదారులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



# గిరిజన మహిళల ఉత్పత్తులకు భద్రగిరి మార్ట్ వేదిక





**భద్రాచలం, మార్చి 31, ప్రజా జ్యోతి:** సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు నిర్వహిస్తున్న గిరిజన మహిళలు, స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలు తయారు చేసే నిత్యావసర సరుకులు మధ్యదళారుల చేతుల్లో పడకుండా, వారికి సరైన మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు భద్రగిరి మార్ట్‌ను ఏర్పాటు చేసినట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు.బుధవారం భద్రాచలం పట్టణంలోని భద్రగిరి మార్ట్‌ను సందర్శించిన సెర్ప్ సీనియర్ మేనేజర్ భవాని శంకర్‌కు అక్కడ అందుబాటులో ఉన్న ఆర్గానిక్, న్యూట్రిషన్ సంబంధిత నిత్యావసర సరుకులను పరిశీలించి వాటి తయారీ విధానం గురించి వివరించారు. గిరిజన మహిళలు తయారు చేసిన ఆహార పదార్థాలు, ఆర్గానిక్ ద్వారా పండించిన బియ్యం, పప్పు దినుసులు, తృణధాన్యాల గురించి పూర్తి వివరాలు తెలియజేశారు.ఈ సందర్భంగా పీఓ బి. రాహుల్ మాట్లాడుతూ, చిన్న తరహా పరిశ్రమలు నిర్వహిస్తున్న మహిళలకు సరైన మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో వారి ఉత్పత్తులు అమ్ముడుపోక జీవనోపాధి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఐటిడిఏ ఆధ్వర్యంలో భద్రగిరి మార్ట్‌ను ప్రారంభించి వారికి మార్కెట్ అవకాశాలు కల్పించామని పేర్కొన్నారు. ప్రజల నుంచి కూడా మంచి స్పందన లభిస్తున్నదని అన్నారు.సెర్ప్ సీనియర్ మేనేజర్ భవాని శంకర్ మాట్లాడుతూ, గిరిజన మహిళలు, ఎస్‌హెచ్‌జీ గ్రూప్ మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు తమ సంస్థ తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. గిరిజన మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఐటిడిఏ పీఓ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందించారు.అనంతరం మార్ట్‌లో ఉన్న సరుకుల నిల్వలు, అమ్మకాల వివరాలు, ప్రజల స్పందనపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులు కొనుగోలు చేసిన వెంటనే బిల్లులు అందించాలని, ర్యాకుల్లో సరుకులు అయిపోయిన వెంటనే భర్తీ చేయాలని సూచించారు. అవసరమైతే ముందుగానే సంబంధిత గ్రూపులకు ఆర్డర్లు ఇచ్చి సరుకులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రజలు కోరుకునే ప్రతి వస్తువు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఏపీవో వేణు, జేడీఎం హరికృష్ణ, డీఎంజీసీసీ సమ్మయ్య, మేనేజర్ ఆదినారాయణ, జీసీసీ మేనేజర్ జయరాజ్, భద్రగిరి మార్ట్ మేనేజర్ భార్గవి, డిపిఎం నర్సయ్య, ఏపీఎం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పాఠశాలల్లో ఐదవ తరగతి ప్రవేశాలకు బ్యాటరీ టెస్టులు

- :ప్రాజెక్టు అధికారి బి. రాహుల్



**భద్రాచలం, మార్చి 31, ప్రజా జ్యోతి:** గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న క్రీడా పాఠశాలల్లో ఐదవ తరగతి ప్రవేశాల కోసం బాలబాలికలకు బ్యాటరీ టెస్టులు నిర్వహించి ఎంపికలు పూర్తి చేసినట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు.కిన్నెరసాని, కచేనపల్లి క్రీడా మైదానాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన గిరిజన బాలబాలికలకు తొమ్మిది రకాల బ్యాటరీ టెస్టులు నిర్వహించారు. ఈ ఎంపికల్లో కచేనపల్లి క్రీడా పాఠశాలకు 40 మంది బాలికలను, కిన్నెరసాని క్రీడా పాఠశాలకు 40 మంది బాలురను ఎంపిక చేసి ఐదవ తరగతిలో ప్రవేశం కల్పించినట్లు పేర్కొన్నారు.ఈ ఎంపికలను దమ్మపేట ఏటీడీవో చంద్రమోహన్, క్రీడల అధికారి గోపాలరావు, ఏసీఎంఓ రాములు, ఏఎస్ఓ వెంకటనారాయణ, రాంబాబు తదితరుల పర్యవేక్షణలో, పీడీలు, పీఈటీలు సారథ్యంలో నిర్వహించారు.ఎంపికలలో కిన్నెరసాని క్రీడా పాఠశాల బాలురు 105 మంది, కచేనపల్లి క్రీడా పాఠశాల బాలికలు 72 మంది పాల్గొన్నారు. వివిధ పరీక్షల అనంతరం రెండు పాఠశాలలకు కలిపి 80 మందిని ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు.

## ప్రాథమిక పాఠశాలకు మట్టి తోలించిన: చింతలపూడి శ్రావణి

- మోకాటి లోతు నీటితో బురదమయం
- విద్యార్థులు,ఉపాధ్యాయులు పాఠశాల లోనికి వెళ్లలేని పరిస్థితికి నేనున్నా అంటున్నా. చింతలపూడి శ్రావణి



**సుజాత నగర్ ప్రజాజ్యోతి ఏప్రిల్ 01:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 21 వ డివిజన్ పరిధిలోని దేగలమడుగు గ్రామంలోని స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రోడ్డు కన్నా చాలా దిగువన ఉండి వర్షాకాలం వస్తే మోకాటి లోతు నీటితో బురదమయం గా మారి విద్యార్థులు,ఉపాధ్యాయులు పాఠశాల లోనికి వెళ్లలేని పరిస్థితి ఉండేది ఎంత మంది ప్రజా ప్రతినిధులకు విన్నవించిన ఆ పిల్లల గోడు పట్టించుకున్న వారే లేకపోయారు.కొద్దిరోజుల క్రితం జరిగిన కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో స్థానిక గ్రామస్థులు,ఉపాద్యాయులు అభ్యర్థన మేరకు 21 వ డివిజన్ కార్పొరేటర్ దంపతులు చింతలపూడి శ్రావణి – సాయి కుమార్ పాఠశాల మౌలిక వసతుల పైన దృష్టి పెడుతా అని మాట ఇచ్చారు.ఇచ్చిన మాటకు కట్టుబడి ఈ రోజు వారి సొంత ఖర్చులతో సు మారు 15000 రూపాయల విలువైన గ్రావెల్ పాఠశాల ప్రాంగణంకు తోలి, ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. కార్పొరేటర్ దంపతులకు స్థానిక గ్రామస్థు లు,ఉపాద్యాయులు ధన్యవాదాలు తెలిపి వారి ఔన్నత్యాన్ని అభినందించా రు.21 వ డివిజన్ లో ఎటువంటి ఇబ్బంది ఉన్న నన్ను కలవండి అని మాట ఇచ్చారు.

## ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా నేడు దమ్మపేటలో గ్రామసభ



**దమ్మపేట,ఏప్రిల్ 01,(ప్రజాజ్యోతి):** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న గ్రామసభల నేపథ్యంలో, దమ్మపేట గ్రామ పంచాయతీ పరిధిలో ఏప్రిల్ 2వ తేదీన గ్రామసభను నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి బండి అనంత కుమార్ తెలిపారు. ఈ గ్రామసభను గ్రామంలోని మర్రి భక్తాంజనేయ స్వామి ఆలయం పక్కన గల పంచాయతీ స్థలంలో సర్పంచ్ పగడాల రమాదేవి అధ్యక్షతన గురువారం ఉదయం 10 గంటల నుండి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించేందుకు సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొననున్నారని, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలు, సమస్యలు తెలియజేసి గ్రామసభను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## తిరుమలలో స్వామివారిని దర్శించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

**దమ్మపేట,ఏప్రిల్ 01,(ప్రజాజ్యోతి):** అశ్వరావుపేట శాసనసభ్యులు ఎమ్మెల్యే శ్రీ జారే ఆదినారాయణ కుటుంబ సమేతంగా బుధవారం పవిత్రక్షేత్రమైన తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనం చేసుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాలు, శాంతి సౌభ్రాతృత్వం కోసం ప్రార్థనలు చేశారు. అలాగే తమ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజల సంక్షేమం సాధ్యమవ్వాలని స్వామివారి ఆశీస్సులు కోరుకున్నారు.దర్శనానంతరం ఆలయ అధికారులు ఎమ్మెల్యే జారేను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, తిరుమల దర్శనం తనకు ఎంతో ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించిందని, స్వామివారి కృపతో రాష్ట్రంలో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని ఆకాంక్షించారు.



## పదవి విరమణ చేసిన ఉపాధ్యాయునికి ఘన సన్మానం

- విద్యార్థులు,పాఠశాల అభివృద్ధి కి మెరుగు శ్రీనివాస్ విశేష సేవలు



**టేకులపల్లి,ఏప్రిల్ 01,ప్రజాజ్యోతి:** టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ పొందిన మెరుగు శ్రీనివాస్‌ని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.ఈ కార్య క్రమములో టేకులపల్లి కాంప్లెక్స్ సెక్రటరీ బాణోత్ లక్ష్మ,ప్రాథమిక పాఠశాలలు హెడ్ మాస్టర్లు వేంకట్రం, సుజాత, వెంకయ్య పాల్గొని ప్రసంగించారు.మెరుగు శ్రీనివాస్ 35 సంవత్సరాలుగా విద్యారంగానికి సేవాలు అందించారని తెలిపారు. వేలాది మంది విద్యార్థులకూ నాణ్యమైన విద్యను అందించి వారి భవిష్యత్తును తీర్చిద్దడంలో కీలక పాత్ర పోసించడంతోపాటు పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. మెరుగు శ్రీనివాస్ బోధనలో నైపుణ్యం , క్రమశిక్షణ, విధ్యార్థులు పట్ల చూపిన అంకితభావం అందరికీ ఆదర్శంగా నిలిచాయన్నారు. పాఠశాల విద్యా ప్రమణాలు పెంచడంలో అతను చేసిన కృషి ఎప్పటికీ చిరస్మరణయమైన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం,వారి సతీమణి కి చిరు బహుమానంగా శాలువుతో సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ టీచర్లు భూటసింగ్ , విరాన్న,మంగిలాల్ ,రాంబాబు,రాజేష్,బలరామ్, సుజాత,వాళ్ళమ్మ హత్తిరం పాల్గొన్నారు.

## లారీ ఢీకొని మహిళ మృతి

- ముష్టిబండ గ్రామ శివారులో విషాద ఘటన
- కేసు నమోదు

**దమ్మపేట ఏప్రిల్ 01, (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం ముష్టిబండ గ్రామ శివారులో గల రాజస్థాన్ దాబా సమీపంలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సత్తుపల్లి వైపు నుండి దమ్మపేటకు వస్తున్న నీలగిరి ఝాన్సీ (40), నీలగిరి రవికుమార్ ప్రయాణిస్తున్న టూ వీలర్ ను వెనుక నుండి అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిన ఝాన్సీ తలపై లారీ వెనుక చక్రం వెళ్లడంతో ఆమె తల నుజ్జునుజ్జై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన స్థానికులను కలచివేసింది.ఈ ప్రమాదంపై కందుకూరి నాగార్జున ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## పేదవాడి ఇంటి కల సాకారం

- – అంకంపాలెంలో ఇందిరమ్మ ఇల్లు శంకుస్థాపన



**దమ్మపేట,ఏప్రిల్ 01,(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలంలోని అంకంపాలెం గ్రామంలో నిరుపేదలకు గృహ స్వప్నాన్ని సాకారం చేసే దిశగా ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. పొట్ట రాముడు ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ మోకాళ్ళ గురుమూర్తి మాట్లాడుతూ, పేదవాడి ఇంటి కలను నిజం చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. అర్హులైన ప్రతి నిరుపేదకు నాణ్యమైన ఇళ్లు నిర్మించి అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. దమ్మపేట యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కాక రమేష్ మాట్లాడుతూ, లబ్ధిదారులకు నాణ్యమైన నిర్మాణంతో పాటు బిల్లులు సక్రమంగా అందిస్తూ, ప్రతి కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చడానికి ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందన్నారు. గ్రామ శాఖ అధ్యక్షులు వాడే వెంకటరావు మాట్లాడుతూ, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందంజలో ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు కాకా సీత, పంచాయతీ కార్యదర్శి పృధ్వి, కాక శ్రీను,ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా పోరు

- లేబర్ కోడ్స్ కార్మిక వర్గానికి మరణ శాసనాలు.
- కార్మిక సంఘాల జేఏసీ.




**టేకులపల్లి,ఏప్రిల్ 01,ప్రజాజ్యోతి:** మోడీ సర్కార్ తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లు కార్మిక వర్గానికి మరణ శాసనం రాస్తున్నాయని జెవిసి ( ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు )డి. ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు.తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్( ఐఎఫ్టియు )మండల కార్యదర్శి ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లును రద్దు చేయాలని కార్మిక సంఘాల జేఏసీ ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారం తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులుడి.ప్రసాద్, టియూసిఐ ఏరియాకార్యదర్శి జె.సుందర్ మాట్లాడుతూకార్మికుల సమరశీల పోరాటాలు,బలిదానాలు నుండి కార్మిక చట్టాలు ఆవిర్భవించాయని కార్మిక చట్టాలు ఉనికిలోనికి రావడానికి 145 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్నదని వేల కొలది కార్మికోద్యమ నిర్మాణాలు పోరాటాలతో ఈ చరిత్ర రూపుదిద్దుకున్నదని వేలాదిమంది కార్మికుల త్యాగాలు బలిదానాలే ఈ చరిత్రకు పునాదిగా ఉన్నాయని అన్నారు. మిలిటెంట్ కార్మికోద్యమ పోరాటాలు బ్రిటిష్ పరిపాలన కాలంలోనూ ఆ తర్వాత కూడా ఒక దశ వరకు నిరంతరం కొనసాగాయని అన్నారు.ఈ నిరంతర త్యాగాల పునాది నుండే కార్మిక చట్టాలు ఉనికిలోకి వచ్చాయని అని అన్నారు. అలాంటి చట్టాలను నేడు నరేంద్ర మోడీ ప్రభుత్వం రద్దు చేసి కార్పొరేటర్లకు మేలు చేకూర్చే నాలుగు కోడ్ లను అమలులోకి తీసుకురావడం కార్మికులకు మరణ శాసనాలని వారు అన్నారు.నాలుగు లేబర్ కోడ్ లు రద్దు అయ్యే అంతవరకు కార్మికులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్( ఐ ఎఫ్ టి యు )నాయకులు జంపన్న, రాజబాబు,కార్తీక్,రవి, గుగులోత్ ప్రసాద్,కృష్ణ కుమార్,బాల,నవీన్,మహేష్, శ్రీరాములు,సురేష్,వెంకట నర్సు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా అంకమ్మ తల్లి తిరుణాల మహోత్సవాలు

- గురువారం ఉదయం అగ్నిగుండ ప్రవేశం, బద్దె గొర్రె కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణ
- గురువారం జరగనున్న తిరుపతమ్మ,గోపయ్య స్వామివారి కళ్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి
- మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు





**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 1, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలో అంకమ్మ తల్లి తిరుణాల మహోత్సవాలు గత ఐదు రోజులుగా భక్తి శ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.బుధవారం రాత్రి ప్రభ బండ్లపై గుడిబండ ఊరేగింపుగా అమ్మవారు ఆలయ ప్రవేశం చేయగా, అనంతరం ఉయ్యాల్లో కూర్చోబెట్టడం ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.గురువారం తెల్లవారు జామున 5 గంటల నుంచి అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం నిర్వహించనున్నారు. బద్దె గొర్రె కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.గురువారం జరగనున్న తిరుపతమ్మగోపయ్య స్వామివారి కళ్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కళ్యాణం అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.అంకమ్మ తల్లి ఆలయ చైర్మన్ పానుగంటి రాఘవులు, హరిహరా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మారగాని శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.ఈ తిరుణాల మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

# నిప్పుల కొలిమిలా భద్రాద్రి

- 44 డిగ్రీలకు చేరుకుంటున్న ఉష్ణోగ్రతలు
- ఎండ తీవ్రత, వడగాల్పులతో అల్లాడుతున్న ప్రజలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న జిల్లా వైద్యాధికారులు
- శీతల పానియాలు, కొబ్బరి నీళ్లకు పెరిగిన డిమాండ్





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 1, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భానుడు అప్పుడే తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఏప్రిల్ నెల ఆరంభంలోనే ఎండలు తీవ్రరూపం దాల్చాయి. ఇప్పటికే ఉష్ణోగ్రతలు 40 సెంటిగ్రేట్ దాటగా, 44 వరకు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఉదయం 10గంటల తరువాత నుంచే వేడి ప్రభావం ఎక్కువగా ఉంటోందని మధ్యాహ్నంకు ఎండ వేడిమి ఎక్కువగా ఉండటంతో మధ్యాహ్నం సమయంలో జిల్లా కేంద్రమైన కొత్తగూడెం, ఇల్లందు, పాల్వంచ, మణుగూరు భద్రాచలం వంటి ప్రధాన పట్టణాల్లోని వీధులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. జిల్లాలో ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలు, వ్యవసాయ పనులకు, రోజువారీ వేతనంపై కూలి పనులకు వెళ్లే వారు ఎండ వేడిమికి తగిన విధంగా తమ పని గంటలను మార్చుకుంటూ పనుల్లో నిమగ్నమవుతున్నారు. మధ్యాహ్నం 12 తరువాత విశ్రాంతి తీసుకొని తిరిగి 3 గంటల తరువాత పనుల్లో నిమగ్నమవుతున్నారు. అలాగే సింగరేణి, కేటీపీఎస్, బీటీపీఎస్, ఐటీసీ, భారజల కర్మాగారాలతో పాటు ఇ తర పారిశ్రామిక ప్రాంతాల్లో పని చేసే కార్మికుల విషయంలో యాజమాన్యాలు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ఎండల ప్రభావంతో పాఠశాలలు సైతం ఒక్కపూటే నిర్వహిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి 12.30 వరకు తరగతులు జరుగుతున్నాయి. అలాగే ఎండ ప్రభావం చిన్న పిల్లలు, వృద్దులపై ఎక్కువగా ఉంటుంది కాబట్టి వారి విషయంలో కుటుంబ సభ్యులు మరింతగా జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే పశువులకు కూడా నీటి తొట్టెలు నింపి ఉంచాలని, వాటిని ఎండ తగలకుండా షెడ్లలో ఉంచాలని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు.

**పిల్లల విషయంలో జాగ్రత్త అవసరం....**

ఎండ వేడిమి బారిన పడకుండా జీవన విధానంలో తగిన మార్పులు చేసుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. పిల్లలు ఎండలో తిరగకుండా, చెరువులు, బావుల్లో ఈతకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఆహారం విషయంలో కూడా జాగ్రత్తలు అవసరమని వైద్యులు చెబుతున్నారు. ఉదయం పిల్లలకు తేలికపాటి, త్వరగా జీర్ణమయ్యే అల్పాహారం ఇవ్వాలి. పండ్లు, పండ్ల రసాలు, రాగిజావ వంటి పోషకాహారం అందించడం మంచిదని సూచిస్తున్నారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన తర్వాత ద్రవపదార్థాలు ఇచ్చి విశ్రాంతి తీసుకునేలా చూడాలి. పాఠశాల నుంచి తిరిగి వచ్చే సమయంలో గొడుగు ఉపయోగించడం, టోపీలు ధరించడం తప్పనిసరి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య ఎండలో బయటకు వెళ్లకుండా ఉండటం ఉత్తమం.

**అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ....**

జిల్లాలో ప్రజలు ఎండ తీవ్రత బారిన పడకుండా ఉండాలంటే మధ్యాహ్నం సమయంలో బయటకు రావద్దని, మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ ప్రభావం ఎక్కువగా ఉండటం వలన అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని పేర్కొన్నారు. వడదెబ్బ తగలకుండా ఉండాలంటే రోజంతా తగినంత నీరు తాగాలని, మంచి నీటితో పాటు మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి పానీయాలు తీసుకోవడం ద్వారా శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుకోవాలని వైద్యులు పేర్కొంటున్నారు. అలాగే బయటకు వెళ్లేటప్పుడు లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలని ఎండ నుండి రక్షణ కోసం గొడుగు లేదా టోపీని తప్పనిసరిగా వాడాలని సూచిస్తున్నారు. తీవ్రమైన తలనొప్పి, మైకం, వికారం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించాలని వైద్యులు పేర్కొంటున్నారు.

**వేసవిని ఎదుర్కొనేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిద్ధం....**

జిల్లాలోని భద్రాచలం, ఇల్లందు , పాల్వంచ, మణుగూరు,కొత్తగూడెం ఏరియా వైద్యశాలలతో పాటు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో వేసవి వలన ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కొనేందుకు వైద్యులు, సిబ్బందిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సిద్ధంచేస్తున్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులను అందుబాటులో ఉంచారు. ప్రజలు వడ దెబ్బబారిన పడకుండా ఆహార నియమాలను పాటించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కోరుతున్నారు.

**పండ్ల రసాలు , కొబ్బరి నీటిని ఎక్కువగా తీసుకోవాలి:డాక్టర్ రాజశేఖర్ రెడ్డి , పిల్లల వైద్య నిపుణులు, భద్రాచలం....**



వేసవి కాలంలో పిల్లలు, వృద్ధుల విషయంలో ఎక్కువగా జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా వీరికి పండ్ల, పండ్ల రసాలు, కొబ్బరి నీరు, చెరుకు రసం వంటి అందుబాటులో ఉంచాలి. అలాగే బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ లేదా తెల్ల రుమాలు వాడడం ద్వారా ఎండబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అనారోగ్య సమస్యలు ఏర్పడితే తక్షణమే వైద్యులను సంప్రదించాలి.